# కంపానియన్

- జి.సరస్వతి

బ్యాగేజి చెకిన్ చేసి మిత్రుడు శంకరం కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు శ్రీకాంత్. అతని మనసు దిగులుతో భారంగా ఉంది. ప్రయాణికుల హడావుడి అతనికేమీ పట్టడంలేదు. తీపితో మొదలై చేదు మిగిల్చిన గతం, భవిష్యత్తులో ఏం జరుగుతుందోననే ఆందోళన అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

***

"నేను, అహల్య ఒకే టీంలో చాలాకాలంగా పనిచేస్తున్నాం. తను చాలా తెలివైంది, చురుకైంది. నేనంటే ప్రాణం. ఇద్దరికీ కెరీరంటే ప్రాణం" అన్నాడు శ్రీకాంత్ తన ఆప్తమిత్రుడు శంకరంతో.

"కెరీరంటే అందరికీ ప్రాణమేరా నాయనా. కెరీర్ని ప్రాణంగా చూసుకుంటూ పనిచేయకపోతే ఉద్యోగం నిలిచేదెలా? పొట్ట గడిచేదెలా? ఇంతకీ ఏమిటి సంగతులు?" అని అడిగాడు శంకరం.

"ఇద్దరం కలిసి బ్రతకాలనుకుంటున్నాం"

"ఆఫీసులో కలిసి పనిచేస్తున్నంతమాత్రాన కలిసి బ్రతకాలనుకోవడం ఎందుకురా?"

"ఒకరినొకరం ఇష్టపడ్డాం కనుక. ఎంతమంది కలిసి ఉద్యోగాలు చేస్తూ దగ్గరై పెళ్లిళ్ళు చేసుకోవడంలేదు? అలాగే మేమూనూ. కాకపోతే అహల్యకు పెళ్లి తంతు, పిల్లల బాదరబందీ ఇష్టంలేదు. అందుకని పెళ్లి చేసుకోకుండా కలిసి బ్రతుకుదామని ప్రపోజ్ చేసింది" అన్నాడు శ్రీకాంత్.

'అమెరికాకు వచ్చి పదేళ్లకు పైగా అయినా అమాయకంగా, సంసారపక్షంగా ఉండే శ్రీకాంత్‌కు ఇంత ధైర్యం, తెగింపు ఎలా వచ్చాయబ్బా?' అని నివ్వెరపోయాడు శంకరం.

"కానీ నీకిప్పటికే పెళ్లాం, ఇద్దరు పసికూనల బాదరబందీ ఉంది కదురా. వాళ్లనేం చేస్తావు?"

"ఏముంది? వాళ్లు కష్టపడనవసరం లేకుండా తగినంత డబ్బు ఏర్పాటు చేస్తాను. హైదరాబాద్‌లో నేను కొన్న అపార్ట్‌మెంట్‌లో హాయిగా ఉంటారు" అన్నాడు శ్రీకాంత్ తేలిగ్గా.

"దురాలోచనతోపాటు దూరాలోచన కూడా చేసావన్నమాట. మరి నిన్ను ప్రాజెక్టులోంచి సడెన్‌గా తీసేశారనుకో. అప్పుడు కూడా అహల్య నిన్ను ప్రాణంగా చూసుకుంటుందా?"

శ్రీకాంత్‌కు ఒళ్ళు మండిపోయింది. 'వీడెప్పుడూ ఇంతే! తికమక పెట్టే ప్రశ్నలు వేసి తిక్కరేగేటట్లు చేస్తాడు' కానీ తను మనసు విప్పి మాట్లాడగలిగింది ఒక్క శంకరంతోనే.

"సిన్సియర్‌గా కష్టపడి పనిచేస్తూ మంచి రిజల్ట్స్ చూపెడుతూ ఉంటే ఎందుకు తీసేస్తారు?" అన్నాడు కోపంగా.

"మరి సంసారమనే లైఫ్‌లాంగ్ ప్రాజెక్టులో నీ పార్టనర్ శాంత కూడా సిన్సియర్‌గా కష్టపడి పని చేస్తూ సుఖసంతోషాలను పండిస్తోంది కదా. ఆమెనెందుకు నీ లైఫ్ నుండి తప్పిస్తున్నావు?" శంకరం సూటిగా అడిగేసరికి శ్రీకాంత్ కొన్ని క్షణాలు మాట్లాడలేకపోయాడు.

"శాంత నాకు తగిన కంపానియన్ కాదురా" అన్నాడు గొంతు పెగల్చుకుని.

"ఆ సంగతి నీకు ఇప్పుడర్థమయిందా?"

"అహల్యతో కలిసి పనిచేయడం మొదలుపెట్టాక శాంతను పెళ్లి చేసుకోవడం పొరపాటనిపిస్తోంది. ఉద్యోగం గురించి ఏం మాట్లాడినా ఆసక్తితో వినదు. పైగా ఇంట్లో కూడా ఆఫీసు ఊసెందుకండీ? హాయిగా పిల్లలతో ఆడుకుని రెస్టు తీసుకోండి. రేపటికి ఫ్రెష్‌గా తయారవుతారు' అంటుంది. అహల్యతో అయితే పని గురించి, ప్రాజెక్టుల గురించి చర్చిస్తూ వుంటే కాలం గడిచిందే తెలియదు" అన్నాడు శ్రీకాంత్.

"శాంత చెప్పింది కరెక్టురా. ఇంటిని కూడా ఆఫీసు చేసేస్తే కొంతకాలానికి విసుగొచ్చేసి ఉద్యోగం మీద ఉత్సాహం తగ్గిపోయి మనసు పెట్టి పని చేయలేని పరిస్థితి రావచ్చు. ఇంట్లో సేదదీరిన మనిషికి ఎప్పుడూ ఉత్సాహానికి కొదవుండదురా! కష్టపడి పనిచేస్తూ ముందుకు వెళ్లవచ్చు" అన్నాడు శంకరం.

"నువ్వు కూడా శాంతకు వత్తాసుగా వంటింటి కబుర్లు చెప్పడం నాకేం నచ్చలేదురా. ఏది ఏమైనా నేను అహల్యను వదులుకోలేను" అన్నాడు శ్రీకాంత్.

"లెక్చరరుగా ఉద్యోగం చేసుకుంటూ తన మానాన తను బ్రతుకుతున్న శాంతను కజిన్ పెళ్లిలో చూసి వెంటపడి పెళ్లి చేసుకుని దూరదేశం తీసుకొచ్చావు. ఇద్దరు బిడ్డల తల్లిని చేసావు. నువ్వు, పిల్లలు తప్ప మరో లోకమంటూ లేకుండా చేసావు. ఇప్పుడు అహల్య మోజులో పడి శాంతకు తీరని అన్యాయం చేస్తున్నావు" బాధతోనూ, కోపంతోనూ అన్నాడు శంకరం.

"నువ్వేం చెప్పినా నా నిర్ణయం మార్చుకోలేను" అన్నాడు శ్రీకాంత్.

"చదువులో బాగా రాణించి పైకి రావాలంటే పట్టుదలే ఉందనుకున్నానుగానీ చెడ్డపని చెయ్యాలనే పట్టుదల కూడా నీకు ఉందని నాకింతవరకూ తెలియదురా. అనుభవమే నీకు గుణపాఠం నేర్పుతుంది" విసుగుతో లేచి వెళ్లిపోయాడు శంకరం.

***

"నాకు ఒంట్లో బాగాలేదు అహల్యా. ఆఫీసుకు రాలేను. నువ్వు కూడా సెలవు పెట్టి తోడుగా ఉండకూడదూ?" అని అడిగాడు శ్రీకాంత్.

అప్పటికి వాళ్ళు కలిసి బ్రతుకుతూ మూడేళ్లయింది. ఉద్యోగమే జీవితంగా రెండేళ్ళు రెండు క్షణాలుగా గడిచిపోయాయి. అహల్యకు ఇంటి పని, వంట పనిమీద బొత్తిగా ఆసక్తి, ఇష్టం లేకపోవడంవల్ల తిండికి పూర్తిగా రెస్టారెంట్లమీద ఆధారపడేవారు. ఇంటి తిండికి, ఇల్లాలి ఆదరణకు, పసిపిల్లల ముద్దు మురిపాలకు అలవాటుపడిన శ్రీకాంత్‌కు క్రమంగా విసుగు మొదలైంది.

దానికితోడు అహల్య పెత్తనం చలాయిస్తున్నట్లు మాట్లాడేది. అటువంటి సమయాల్లో శ్రీకాంత్‌కు నెమ్మదస్తురాలైన శాంత గుర్తుకొస్తూ ఉండేది. అపరాధభావాన్ని అణచిపెట్టే ప్రయత్నం చేసేవాడు. కాలం గడిచేకొద్దీ అహల్య కూడా మమతానురాగాల విలువ తెలుసుకుని మారుతుందని ఆశిస్తూ ఉండేవాడు. పని వత్తిడితోను, నొప్పి కలిగించే అహల్య ప్రవర్తనతోనూ శ్రీకాంత్ బాగా కృంగిపోయాడు.

***

"నీకు బాగాలేకపోతే నేనెందుకు సెలవు పెట్టి టైము వేస్టు చేసుకోవడం? ఈ రోజు ముఖ్యమైన మీటింగ్ కూడా ఉంది" అహల్య ముఖం చిట్లిస్తూ అంది.

"ఒక్కడినే ఉంటే బోరు కొడుతుంది అహల్యా"

"అందుకని నేను నీతో ఉంటే నాకు బోరు కొడుతుంది. జలుబు చేసి కాస్త జ్వరం వచ్చినందుకే జబ్బుతో మంచాన పడ్డట్టు మాట్లాడుతున్నావు. పనిమీద శ్రద్ధ ఉన్నవాడివైతే టాబ్లెట్లు వేసుకుని తయారై పనికి బయల్దేరేవాడివి"

"నాకు పనిమీద శ్రద్ధ లేదని ఎందుకంటావు అహల్యా! అసలు వర్కు వల్లనే మనం దగ్గరైనామనే సంగతి మర్చిపోయావా?"

"అప్పట్లో నాకు దగ్గరవడానికి కష్టపడి పనిచేసావు. నీ ప్లాను నెరవేరాక నీలో నిర్లక్ష్యం పెరిగిపోయింది. అది నాకు బొత్తిగా నచ్చడం లేదు" అంది చిరాగ్గా.


"ఇంటిని కూడా ఆఫీసు చేసుకుంటే విసుగొస్తుంది అహల్యా! నాలుగురోజులపాటు ఎక్కడికైనావెళ్లి రిలాక్సవుదామంటే ఒప్పుకోవు"

"ఇదివరకే నీతో ఎన్నోసార్లు చెప్పాను నా బ్రతుకు సమస్తం ఆఫీసేనని. నాలాగా ఆలోచించే మనిషినే నేను ఇష్టపడతాను. నువ్వుకూడా నాలాంటి వాడివనుకుని ప్రపోజ్ చేసి పొరపాటు చేసాను"

"పొరపాటు నీది కాదు అహల్యా నాది. నా భార్యాబిడ్డల్ని వదులుకుని నీతో వచ్చినందుకు నాకు తగిన శాస్తి జరిగింది" అన్నాడు అసహనంగా.

"నన్ను ఉద్ధరించడానికి పెళ్లాం బిడ్డల్ని వదులుకున్నట్లు మాట్లాడకు. నీ త్యాగం, నీ ఉద్ధరింపు నాకేం అవసరంలేదు. నీ దారిన నువ్వు వెళ్లవచ్చు" కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేసి అహల్య విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది. అవమానభారంతో పక్కమీద వాలిపోయాడు శ్రీకాంత్.

'అహల్యే నిన్ను పొమ్మనడం ఖాయం. అప్పుడుగానీ నీకు బుద్ధి రాదురా' శంకరం ఆ రోజు వెళ్తూ అన్న మాటలు గుర్తుకొచ్చి పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు.



★★★

"ఇండియాలోనే ఉద్యోగం చూసుకుని స్థిరపడాలన్న నీ నిర్ణయం నీకు మేలు చేస్తుందిరా శ్రీ" అన్నాడు శంకరం శ్రీకాంత్ పక్కన కూర్చుంటూ.

"నిజంగానా శంకరం? శాంత నన్ను క్షమిస్తుందంటావా?" దిగులుగా అడిగాడు శ్రీకాంత్.

"శాంత నువ్వు కలిగించిన తీవ్ర మనస్థాపం నుండి తేరుకుని సమాధానపడి నిన్ను క్షమించి ఆదరించడానికి కొంతకాలం పట్టవచ్చు. ఆమె వ్యక్తిత్వానికి గౌరవం ఇచ్చి ఓర్పుగా, నిజాయితీగా ఉండి ఎదురుచూడు" అన్నాడు శంకరం.

సెక్యూరిటీ చెక్ మొదలైంది.

"మీ సంసారం తప్పకుండా నిలబడుతుందనే నమ్మకం నాకుంది శ్రీ. శాంతను, పిల్లల్ని అడిగానని చెప్పు. ఆల్ ది బెస్ట్" అంటూనే శంకరం లేచి శ్రీకాంత్‌ను దగ్గరకు తీసుకుని వీపు నిమిరాడు ఆప్యాయంగా. ఇద్దరి కళ్లు తడి అయ్యాయి.

గుండె నిండా ఆశ నింపుకుని ముందుకు సాగాడు శ్రీకాంత్.

★